

బీఆర్ఎస్ కారేపల్లి నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

# మ్యానిఫెస్టోకు బ్రహ్మరథం

- బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- కాంగ్రెస్ గ్యారెంటీల మాయమాటలను ప్రజలకు వివరించాలి
- కారేపల్లి మండల నేతల సమావేశంలో ఖమ్మం ఎంపీ నామా

ఖమ్మం, అక్టోబర్ 18: బీఆర్ఎస్ మ్యానిఫెస్టోకు అన్ని వర్గాల ప్రజలూ బ్రహ్మరథం పడుతున్నారని ఖమ్మం ఎంపీ, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. వైరాలో బీఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ చెబుతున్న గ్యారెంటీ హామీలన్నీ వారంటీ లేనివేనని, వారి మాయమాటలను ప్రజలకు వివరించాలని సూచించారు. బీఆర్ఎస్ సింగరేణి (కారేపల్లి) మండలం బీఆర్ఎస్ నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులతో ఖమ్మంలోని తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ నామా మాట్లాడారు. ఎంతో దూరదృష్టితో ఆలోచించిన సీఎం కేసీఆర్.. మ్యానిఫెస్టోను అత్యద్భుతంగా రూపొందించారని అన్నారు. దీనిని ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. బీఆర్ఎస్ విజయానికి బాటలు వేయాలని కోరారు. వైరా నియోజకవర్గంలో మదన్‌లాల్ గెలుపు ఎప్పుడో ఖాయమైందని స్పష్టం చేశారు. మంచి మెజార్టీ కోసం రేయింబవళ్లూ శ్రమించాలని సూచించారు. ఎన్నికల రూట్ మ్యాప్‌తో ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలని కోరారు. ఎన్నికలప్పుడే కన్పించి మాయమాటలు చెప్పే వారి పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ అభ్యర్థి మదన్‌లాల్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, సింగరేణి ఎంపీపీ శకుంతల, చీమలపాడు సర్పంచ్ కిశోర్ పాల్గొన్నారు.

# ఖమ్మాన్ని మరింత అభివృద్ధి చేస్తా

- సీఎం కేసీఆర్‌కు, నాకు హ్యాట్రిక్ విజయాన్ని అందించండి
- రూ.300 కోట్లతో తాగునీటి సమస్యను శాశ్వత పరిష్కారం
- నడిబొడ్డున లకారాన్ని నిర్మించి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాం
- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



దుర్గామాత విగ్రహం వద్ద పూజలు చేసి మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, అక్టోబర్ 18: ఈ ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు, తనకు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ కోరారు. ఈసారి కూడా తనకు అధిక మెజార్టీ అందిస్తే ఖమ్మాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. ఖమ్మం 12వ డివిజన్‌లో ధూళిపాళ్ల నాగేశ్వరరావు అధ్వర్యంలో బుధవారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం వేగంగా విస్తరిస్తున్న నగరమని, అత్యధిక సంఖ్యలో ప్రజలు ఇక్కడ ఉండడానికి ఆసక్తి చూపిస్తున్నారని అన్నారు. ఒకప్పుడు ఇక్కడ గజం స్థలం విలువ రూ.10 వేల లోపు ఉండేదని, అదే ఇప్పుడు రూ.30 వేలకు పైగా పలుకుతోందని, దీంతో ప్రజల ఆస్తుల విలువ కూడా పెరిగిందని అన్నారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై అత్యధికంగా ఖర్చు చేయడం ద్వారానే ఇది సాధ్యమైందని అన్నారు. గతంలో నగర ప్రజలకు తాగునీళ్లు అందించేందుకు 25 వేల నల్లా కనెక్షన్లు ఉంటే.. వాటిని ఇప్పుడు 75 వేలకు పెంచామని, ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చామని వివరించారు. గతంలో ఉన్న ఏడు ఓవర్ హెడ్ ట్యాంకులను ఇప్పుడు 27కు పెంచినట్లు చెప్పారు. కేవలం నగర ప్రజలకు తాగునీటిని అందించేందుకే రూ.300 కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. నగర నడిబొడ్డున మురుగునీటి నిల్వ కేంద్రంగా ఉన్న లకారాన్ని శుభ్రం చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా తీర్చిదిద్దినట్లు వివరించారు. ఖమ్మంలో విద్యా, వైద్య రంగాలను కూడా బలోపేతం చేశామని అన్నారు. ఏం చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందో అదే కమిట్మెంట్‌తో ఉన్న నాయకుడు ఖమ్మానికి అవసరమని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలో శాంతిభద్రతలు పటిష్టంగా ఉండాలనే ఉద్దేశంతో ఖమ్మం జిల్లాను పోలీస్ కమిషనరేట్ చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ దగ్గర పట్టుబట్టి కమిషనరేట్‌గా చేసుకున్నామని గుర్తు చేశారు. అనేక సదుపాయాల కల్పన అనంతరం నేడు ఖమ్మం గ్రోత్ సెంటర్‌గా నిలిచిందని, హైదరాబాద్ తరువాత ఖమ్మమే ఆ స్థాయిలో అభివృద్ధి చెందిందని వివరించారు. విజ్ఞులైన ఖమ్మం ప్రజలంతా ఈ ఎన్నికల్లోనూ మళ్లీ బీఆర్ఎస్ వైపే నిలవాలని కోరారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు, ప్రముఖులు కొండబాల కోటేశ్వరరావు, చిరుమామిళ్ల లక్ష్మీనాగేశ్వరరావు, కట్టా కృష్ణార్జునరావు, వనమా విశ్వేశ్వరరావు, సీతారాములు, పోటు సుబ్బారావు, వజినేపల్లి శ్రీనివాస్, జట్ల కృష్ణయ్య, తాతా ప్రసాద్, వల్లభనేని రామారావు, శ్రీకాంత్, సరిపుడి గోపి పాల్గొన్నారు. అనంతరం 28వ డివిజన్ ప్రకాశ్‌నగర్‌లో దుర్గామాత విగ్రహం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి అజయ్ ప్రారంభించారు. బచ్చు విజయ్‌కుమార్, గజ్జెల లక్ష్మీ వెంకన్న, నాగండ్ల కోటి, పల్లి ఉపేందర్ పాల్గొన్నారు.

## అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తగా ఆర్‌జేసీ కృష్ణ



ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల బీఆర్ఎస్ ఎన్నికల సమన్వయకర్తగా గుండాల (ఆర్‌జేసీ) కృష్ణను పార్టీ అధినేత కేసీఆర్ నియమించారు. ఆర్‌జేసీ కృష్ణ బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయం నుంచి పార్టీ అన్ని నియోజకవర్గాల అభ్యర్థులను సమన్వయపరుస్తూ ఉంటారని మంత్రి అజయ్ తెలిపారు. అదేవిధంగా సమన్వయ కమిటీ సభ్యులుగా ఉప్పల వెంకటరమణ, ఎండీ ఖమర్, చింతనిప్పు కృష్ణచైతన్య, పులిపాటి ప్రసాద్, చిత్తారు సింహాద్రియాదవ్, ఆకుల మూర్తి, యాతాకుల భాస్కర్ మాదిగ, బోయినపల్లి కృష్ణమూర్తి, డోకుపర్తి సుబ్బారావు, పోలీసు వెంకన్నలు ఉంటారని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు మరో ప్రకటనలో తెలిపారు.

# ఎమ్మెల్యే మెచ్చాను కలిసిన సోయం వీరభద్రం

**బీఆర్ఎస్‌లో చేరేందుకు వైఎస్ఆర్‌టీపీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడి చర్చలు**



ఎమ్మెల్యే మెచ్చాతో మాట్లాడుతున్న సోయం వీరభద్రం

దమ్మపేట, అక్టోబర్ 18: అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును వైఎస్ఆర్‌టీపీ జిల్లా అధ్యక్షుడు సోయం వీరభద్రం బుధవారం కలిశారు. మండలంలోని తాటి సుబ్బన్నగూడెంలో ఉన్న ఎమ్మెల్యే నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి తాజా రాజకీయాలపై చర్చించారు. అయితే, వైఎస్ఆర్‌టీపీ అధినేత్రి షర్మిల ఇటీవల తమ పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేస్తామని ప్రకటించిన విషయం విదితమే. దీంతో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సోయం వీరభద్రం ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ క్రమంలోనే పార్టీలో చేరే అంశంపై ఎమ్మెల్యే మెచ్చాతో చర్చించినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్‌లో ఎవరు చేరినా వారికి పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని, అందరికీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే మెచ్చా వివరించినట్లు తెలిసింది.

# ధనలక్ష్మీదేవిగా అమ్మవారి దర్శనం

**భద్రాద్రి లక్ష్మి తాయారు అమ్మవారికి నేడు ధాన్యలక్ష్మి అలంకారం**



భద్రాచలం, అక్టోబర్ 18: భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష్మి తాయారు అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాలు జరిగే తొమ్మిది రోజులు అమ్మవారు రోజుకో రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. బుధవారం ఉదయం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి అష్టోత్తర శత నామార్చన, సామూహిక కుంకుమ పూజలు జరిపారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై తమ ఇష్ట దైవానికి ప్రత్యేక పూజలు చేసి కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న చిత్రకూట మండపంలో సంక్షేమ రామాయణ పారాయణంలో భాగంగా అయోధ్య కాండ పారాయణం చేశారు. సాయంత్రం స్వామివారికి దర్బారు సేవ, నివేదన, మంత్రపుష్పం, తీర్థ, ప్రసాద గోష్టి నిర్వహించారు. రాత్రి స్వామివారికి తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ జరిపారు.

# బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం

- సీఎం కేసీఆర్ రూపొందించిన మ్యానిఫెస్టోతో ప్రజలందరికీ మేలు
- సీపీఎం, కాంగ్రెస్ గెలిచినా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదు
- ఒక్కసారి నాకు అవకాశమిస్తే నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతా
- భద్రాచలం పర్యటనలో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు



మాట్లాడుతున్న తెల్లం వెంకట్రావు

భద్రాచలం, అక్టోబర్ 18: బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ రూపొందించిన మ్యానిఫెస్టోతో ప్రజలందరికీ మేలు జరుగుతుందని అన్నారు. ఇప్పటి వరకూ ఇక్కడి ప్రజలు సీపీఎం, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించినా వారు ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ ఎంతో నమ్మకంతో బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థిగా రెండోసారి కూడా తనకు అవకాశమిచ్చారని అన్నారు. ఆసారి ఇక్కడి ప్రజలు తనను గెలిపిస్తే ఈ నియోజకవర్గాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతానని అన్నారు. భద్రాచలంలోని రాజీవ్‌నగర్ కాలనీలో (151వ బూత్)లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన పదేళ్లుగా భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధిలో వెనకపడిందని అన్నారు. 2014లో సీపీఎం అభ్యర్థి గెలిచి ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా వదిలివేశారని ఆరోపించారు. 2018లో టూరిస్ట్ ఎమ్మెల్యేను ప్రజలు గెలిపిస్తే.. ప్రభుత్వం నుంచి ఆయన నిధులు తీసుకురాకుండా, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా కాలం గడిపారని విమర్శించారు. పైగా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలను అమ్ముకున్నారని ఆరోపించారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేను కలవాలంటే ప్రజలకు ఎంతో కష్టమని అన్నారు. ఆయన ఎక్కడ ఉంటాడో ఆయనకే తెలియదని, ఒక రోజు భద్రాచలం ఉంటే, మరో రోజు వరంగల్ ఉంటారని, ఇంకో రోజు హైదరాబాద్‌లో ఉంటారని విమర్శించారు. అటువంటి టూరిస్ట్ ఎమ్మెల్యేను గెలిపించి తప్పు చేశామని చాలామంది ప్రజలు తనతో చెప్పి బాధపడుతున్నారని అన్నారు. స్థానికుడినైన తనకు అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చూపిస్తానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను కాంగ్రెస్ నాయకులు కాపీ కొట్టి ప్రచారం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే ప్రజలకు భరోసా కలుగుతుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు అరికెల్ల తిరుపతిరావు, ఎండీ నవాబ్, రత్నం రమాకాంత్, కోటగిరి ప్రభోధ్‌కుమార్, గంగా భారతి, హనుమంతరావు, కాశీం, పెద్దినేని శ్రీను, మామిడి పుల్లారావు, లకావత్ వెంకటేశ్వర్లు, బోడా మణి, కాపుల శ్రీను, తాళ్లపల్లి రమేశ్‌గౌడ్, మదారి, లక్ష్మీకాంతం, లక్ష్మి బాయమ్మ, అనసూర్య, సలోమి, బీ.లక్ష్మి, టీ.శారద, విజయలక్ష్మి, కాశింబీ, ఫయాజ్, ఒగ్గు అనురాధ, సత్యవేణి, మైథీన్‌బీ, రసూల్‌బీ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616